## గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

వినాయక్‌నగర్, మే 5: నగరంలో సోమవారం మూడు గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. జిల్లా ప్రభుత్వ దవాఖాన ప్రధాన గేటు ఎదుట ఆదివారం సుమారు 60–65 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి పడి ఉండడంతో దవాఖానకు తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారని వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మరో ఘటనలో జీజీహెచ్ గేటు పండ్ల దుకాణం ఎదుట 40–45 ఏండ్ల మధ్య వయస్సు వ్యక్తి పడి ఉండడాన్ని గమనించి, స్థానికుల సమాచారంతో దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు మృతిచెందినట్లు చెప్పారు. గాంధీ చౌక్‌లోని ఖచ్చియా మసీదు గేటు ఎదుట ఓ మహిళ పడిపోయి ఉండగా.. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు దవాఖానకు తరలించారు. ఆమె మృతిచెందినట్లు నిర్ధారించిన వైద్యులు.. మృతురాలి వయస్సు 60–65 ఏండ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతదేహాలను ప్రభుత్వ దవాఖానలోని మార్చురీలో భద్ర పరిచామని, మృతుల సంబంధీకులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసులకు లేదా 87126 –59714 నంబర్‌లో సంప్రదించాలని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో సూచించారు.

## విద్యార్థినికి అభినందన



సాత్వికను అభినందిస్తున్న డీఈవో అశోక్

ఖలీల్‌వాడి, మే 5: నగరంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలకు చెందిన బి.సాత్విక పదో తరగతిలో 581 మార్కులు సాధించింది. దీంతో విద్యార్థినితో పాటు ఉపాధ్యాయ బృందాన్ని డీఈవో అశోక్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గుగులోత్ సౌమ్యకు సన్మానం



సౌమ్యను సన్మానిస్తున్న కేర్ కాలేజీ డైరెక్టర్ సుధాకర్

ఖలీల్‌వాడి, మే 5: జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్యను కేర్ డిగ్రీ కాలేజీలో సోమవారం ఘనంగా సన్మానించారు. కాలేజీ డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ.. సౌమ్య తమ కాలేజీ పూర్వ విద్యార్థిని కావడం గర్వంగా ఉన్నదన్నారు. ఆమెకు జాతీయ స్థాయి అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. భువనేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐఎఫ్ఎఫ్ వార్షిక అవార్డు అందుకున్న సందర్భంగా ఆమెను సన్మానించామన్నారు.

## ప్రైవేటు దవాఖానలకు ఫైన్

ఖలీల్‌వాడి, మే 5: ప్రభుత్వ నిబంధనలు పాటించని పలు దవాఖానలకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి రాజశ్రీ సోమవారం ఫైన్ విధించారు. ఒక దవాఖానకు రూ.25 వేలు, మరో దవాఖానకు రూ.పది వేల జరిమానా విధించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో పలు వాహనాలు ధ్వంసం

వినాయక్‌నగర్, మే 5: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద వేగంగా వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకాల వస్తున్న పలు వాహనాలు ఒకటికి ఒకటి ఢీకొని ధ్వంసమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకున్నది. లారీకి సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకాల వస్తున్న రెండు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొని ధ్వంసమయ్యాయి. వాటి వెనుకాల నుంచి డీసీఎం, దాని వెనుక ఉన్న మరో రెండు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. మొత్తం ఐదు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై వాహనాల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కంఠేశ్వర్, మే 5: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 117 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అదనపు కలెక్టర్లతోపాటు జడ్పీ సీఈవో సాయాగౌడ్, ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతికి ఫిర్యాదులు అందజేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా, ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రోడ్డు వేయాలని ఫిర్యాదు..**

కోటగిరి, మే 5: కోటగిరిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ దవాఖాన వరకు 33 ఫీట్ల సీసీ రోడ్డు వేయాలని కోటగిరి వాసులు ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. ఇంతకు ముందు కోటగిరి తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ రాజ్ ఏఈకి వినతి పత్రం అందజేసినా వారు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈరోడ్డు గతంలో పోతంగల్‌కు వెళ్లే ప్రధాన దారిగా ఉండేదన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు ఎక్కువగా వాడకపోవడంతో కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం 10 ఫీట్ల రోడ్డు ఉన్నదని, సర్వే చేయించి 33 ఫీట్ల రోడ్డు వేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్, మామిడి శ్రీనివాస్, సతీశ్, శ్యామ్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు. కోటగిరిలోని దామర చెరువు తూము మరమ్మతులు చేయించాలని కోరుతూ పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తూము లీకేజీతో ఆయకట్టు పంటలకు సరిగా నీరు అందడం లేదని పేర్కొన్నారు. లీకేజీ కాకుండా మరమ్మతులు చేయించాలని రైతులు కోరారు.

# సార్వత్రిక సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి, మే 5: దేశవ్యాప్తంగా ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె నోటీసును మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఓమయ్య, రమేశ్‌బాబు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు భూపతి, రాజేశ్వర్, కిరణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెను విజయవంతం చేయాలి..**

డిచ్‌పల్లి, మే 5: కార్మిక సంఘాలు ఈనెల 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ కార్మికులకు పిలుపునిచ్చారు. ముందుగా డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ ఎదుట ప్ల కార్డులు ప్రదర్శిస్తూ సోమవారం నిరసన చేపట్టారు. రైల్వే స్టేషన్ మేనేజర్ గంగరాజుకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. రైల్వేను ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనను కేంద్రం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, రైల్వే ప్రయాణికులు పాల్గొన్నారు.

## పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఇందల్వాయి, మే 5: మండలంలోని గౌరారం 33/11 సబ్‌స్టేషన్‌లో కోటి రూపాయలతో అదనంగా ఏర్పాటుచేసిన 5 ఎంవీఏ కెపాసిటీ ఉన్న కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్ఈ రవీందర్ సోమవారం ప్రారంభించారు. దీంతో గౌరారం, లింగాపూర్, జీకే తండా ప్రజలకు లోవోల్టేజీ సమస్య తీరుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు. డీఈ అల్జాపూర్ రమేశ్, ఏడీఈ శ్రీనివాస్, డీఈ వెంకటరమణ, ఏడీఈ నటరాజ్, ఏఈ సాయిలు, జ్ఞానేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మరొకరి ఖాతాలోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్

రుద్రూర్, మే 5: ఆన్‌లైన్‌లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసే సమయంలో పొరపాటున వేరే వ్యక్తి ఖాతాలోకి వెళ్లాయి. వాటిని రుద్రూర్ ఎస్సై సాయన్న తిరిగి బాధితుడికి ఇప్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన చింతల ముత్యాలు ఏప్రిల్ 15వ తేదీన గూగుల్ పే ద్వారా రూ.పది వేలు ఒకరికి ట్రాన్స్‌ఫర్ చేశాడు. నంబర్ తప్పుగా డయల్ చేయడంతో అవి రుద్రూర్ మండలం రాణంపల్లికి చెందిన ఎర్రోళ్ల నర్సింహులు ఖాతాలో జమయ్యాయి. విషయాన్ని బాధితుడు రుద్రూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై సాయన్న డబ్బులు జమ అయిన వ్యక్తి నుంచి తీసుకొని, బాధితుడికి ఇప్పించాడు.

## పాకిస్తాన్ పౌరులను జిల్లా నుంచి వెళ్లగొట్టండి

- సీపీకి ఎమ్మెల్యేల వినతి

వినాయక్‌నగర్, మే 5: జిల్లాలో పాకిస్తాన్ పౌరులు ఉన్నారని, వారిని ఇక్కడి నుంచి వెళ్లగొట్టాలని కోరుతూ నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సీపీ సాయిచైతన్యను సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. పాకిస్తాన్ పౌరసత్వం చెల్లుబాటు కాని వీసాలతో నివసించే వారిని గుర్తించి, బహిష్కరించాలని సీపీని కోరారు. ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తులు గతంలో నిజామాబాద్‌లో పట్టుబడిన విషయాన్ని వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## పసుపు తయారీ పరిశ్రమ ప్రారంభం

జక్రాన్‌పల్లి, మే 5: పసుపు రైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మనోహరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇందూరు పసుపు తయారీ పరిశ్రమను ఎంపీ అర్వింద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సంఘాలుగా ఏర్పడితే.. సబ్సిడీ రుణాలు ఇస్తామని చెప్పారు. దొంగ పాస్‌పోర్టులకు బోధన్ అడ్డాగా మారిందన్నారు. కార్యక్రమంలో అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## న్యాయ సంహిత పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీ సాయి చైతన్య

వినాయక్‌నగర్, మే 5: భారత న్యాయ సంహితలోని నూతన చట్టాలతో ఉన్న పోస్టర్లను సీపీ సాయిచైతన్య సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ మీ సేవ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన ఈ పోస్టర్లను ప్రతి మీ సేవ కేంద్రంలో ప్రదర్శించాలని సీపీ సూచించారు.

## ఆరోగ్య కేంద్రం తనిఖీ

రుద్రూర్, మే 5: రుద్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సమత సోమవారం సందర్శించారు. దవాఖాన పరిసరాలను పరిశీలించిన అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆయేషా సిద్ధిఖా తదితరులు ఉన్నారు.

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రూర్, మే 5: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్న వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్యాన్స్, యోగా, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూజిక్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉండి, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు మంగళవారం వరకు జడ్పీహెచ్ఎస్‌లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

డిచ్‌పల్లి, మే 5: మండలంలోని కోరాట్‌పల్లి గ్రామంలో ఉపాధిహామీ కార్మికులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిచ్‌పల్లి సీఎఫ్ఎల్ కౌన్సెలర్లు డి.శ్రీనివాస్, జ్యోత్స్న మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రథకాలను వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సురేశ్ పాల్గొన్నారు.

## సైన్స్ శిబిరంలో రాంపూర్ విద్యార్థులు

డిచ్‌పల్లి, మే 5: మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ, డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో వేసవి సైన్స్ శిక్షణా శిబిరాన్ని 12 రోజులపాటు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 114మంది విద్యార్థులు పాల్గొనగా.. డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కూడా హాజరయ్యారు. సైన్స్ జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అందించేందుకు ఈ శిబిరం ఎంతో దోహదపడిందని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

## కారు, భూమి ఉంటే ఇందిరమ్మ ఇల్లు రాదు

ధర్పల్లి, మే 5: కారు, ఐదెకరా భూమి, ఇదివరకు ఇల్లు ఉన్న వారికి కొత్తగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాదని ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు. ధర్పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై ఆయన గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. ధర్పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 1980మంది దరఖాస్తు చేసుకోగా.. 556మంది అర్హులని తేల్చామన్నారు. వారిలో 155 మందికి మంజూరు లభించిందని చెప్పారు. కార్యదర్శి శ్రీనివాస్, చెలిమెల శ్రీనివాస్, గంగారెడ్డి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

## 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

పోతంగల్, మే 5: మండల కేంద్రాల్లో సాగు అంశాలపై రైతులకు అవగాహన కల్పించడానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొని.. యూరియా వాడకాన్ని తగ్గించడం, అవసరం మేరకే రసాయనాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ అనిల్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలి

సారంగాపూర్, మే 5: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాల్సిన బాధ్యత వీవో అధ్యక్షులు, వీవోఏలపై ఉన్నదని ఐకేపీ ఏపీఎం మహేశ్‌కుమార్ అన్నారు. మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు సునీతారెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన వార్షిక మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే.. కొత్త రుణాలు మంజూరవుతాయని తెలిపారు.

అనంతరం మహిళా సమాఖ్య మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రెడ్డి సునీత, కార్యదర్శిగా బడిగె విజయ, కోశాధికారిగా బైకన్ స్వప్నతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీలు సంతోష్, భాస్కర్, వీణారాణి, సుజాత, అకౌంటెంట్ రజిత, కంప్యూటర్ ఆపరేటర్ నిరంజిని తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలి

మాక్లూర్, మే5: మండలంలోని ఒడ్యాట్‌పల్లి, అమ్రాద్ తదితర గ్రామాల్లో ధాన్యం తూకం వేయడం లేదని ఐపకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దడ్డు గంగాధర్ అన్నారు. సోమవారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. సొసైటీ ద్వారా, ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీల కొరతతో రైస్ మిల్లులకు తరలించడం లేదన్నారు.

## దవాఖాన నిర్మాణానికి భూమిపూజ

బోధన్, మే 5: పట్టణంలోని లయన్స్ కంటి దవాఖాన నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న లయన్స్ జనరల్ దవాఖాన నిర్మాణానికి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా నిర్మిస్తున్న భవనానికి రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు బసవేశ్వరరావు, లక్ష్మీ బసవేశ్వరరావు, లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభ అవార్డుల అందజేత



విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, మే 5: బోధన్ డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నుంచి ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సోమవారం పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియంలో ప్రతిభా అవార్డులను అందజేశారు. బోధన్ ప్రైవేట్ స్కూల్స్, కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల టాపర్లకు జ్ఞాపిక అందజేసి శాలువాలతో విద్యార్థులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్, ట్రస్మా బోధన్ పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల హరికృష్ణ, గౌరవ అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, ట్రస్మా ప్రతినిధులు మిద్దెల రాజు, సూర్యప్రకాశ్, దిగంబర్‌రావు, విజయ్‌కుమార్, సురేశ్, జయప్రకాశ్, తేళ్ల రవికుమార్, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ బసవేశ్వరరావు, ఎంఈవో నాగయ్య, ఏసీపీ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు గంగాశంకర్, డి.నాగేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలి



రామారావును సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, మే5: మండలంలోని లక్మాపూర్ వద్ద నిర్మిస్తున్న లిఫ్ట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ముల్లంగి(బీ), బొంకన్‌పల్లి, గొట్టుముక్కల గ్రామాల రైతులు జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ ఇరిగేషన్ డీఈ, నిజామాబాద్ ఇరిగేషన్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన రామారావును ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు గ్రామాల పరిధిలోని సుమారు 1100 ఎకరాలకు సాగు నీరందించేందుకు ఎత్తిపోతల పథకాన్ని లక్మాపూర్ పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసేందుకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.11.47కోట్లు మంజూరు చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే పనులు 75 శాతం పూర్తి చేశారు. ప్రభుత్వం మారగానే మిగితా 25 శాతం పనులు ఆగిపోయాయి. దీంతో ఆయా పార్టీలకు చెందిన రైతులు జడ్పీ మాజీ చైర్మన్ సమక్షంలో అధికారులను కలిశారు. జూలై నాటికి పనులు పూర్తి చేసి సాగునీరందిస్తామని ఇరిగేషన్ ఈఈ, డీఈలు తెలిపారు.

## ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రెంజల్/వేల్పూర్, మే 5: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పేర్కొన్నారు. సోమవారం రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీవో తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఎంపిక చేసిన అర్హుల జాబితా ప్రకారం లబ్ధిదారుల వెరిఫికేషన్ సర్వేను అధికారులు నిర్వహించారు. ఎంపీవో సాయిలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు శాస్త్రవేత్తల సూచనలు

ముప్కాల్/ఆర్మూర్‌టౌన్, మే5: ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామంలో, ఆర్మూర్ మండలంలోని పిప్రి రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు సోమవారం నిర్వహించారు. వివిధ అంశాలపై రైతులకు సూచనలను చేశామని ముప్కాల్ మండల వ్యవసాయ అధికారి జి.సాయికృష్ణ తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త, రుద్రూర్ ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాకేశ్ హాజరై రైతులకు సూచనలను అందించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రేవంత్ నాథన్, ఏఈవోలు నరేశ్, అరుణ పాల్గొన్నారు. ఆర్మూర్ మండలంలోని పిప్రి రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంఏవో హరికృష్ణ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

# లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి



భీమ్‌గల్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకుడు రమేశ్

భీమ్‌గల్, ఏప్రిల్ 5: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి భీమ్‌గల్ బస్టాండులో జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, పెట్టుబడిదారులు కలిసి 12 గంటల పని విధానం కోసం చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీయూ జిల్లా నాయకులు కే.రాజేశ్వర్, జిలుకర నడ్పన్న, లక్ష్మణ్, శ్రమణ్, నాగరాజు, అరవింద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, నాయకులు సత్తెవ్వ, నరేందర్, నరేశ్, సత్యనారాయణ, గంగాధర్, ఫయాజ్, అశోక్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

**20న సమ్మెను విజయవంతం చేయండి**

ఆర్మూర్‌టౌన్, మే5: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు వెంకటేశ్ అన్నారు. చేపూర్ గ్రామంలో సీపీఎం జెండాను ఆపార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుతాడి ఎల్లయ్య, మోహన్, పోశన్న, మహిపాల్ పాల్గొన్నారు.

## లింబాద్రి గుట్టపై దిల్‌రాజు దంపతుల పూజలు



లింబాద్రి గుట్టపై దిల్‌రాజు దంపతులు

భీమ్‌గల్, ఏప్రిల్ 5: ఉత్తర తెలంగాణలోని ప్రముఖ పుణ్య క్షేత్రం మండలంలోని లింబాద్రి గుట్టపై ఉన్న లక్ష్మీనృసింహ స్వామిని సోమవారం తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, సినీ నిర్మాత దిల్ రాజు దంపతులు దర్శించుకున్నారు. అనంతరం వారు భీమ్‌గల్ పట్టణంలోని లింబాద్రి లక్ష్మీనృసింహ స్వామి వారి గ్రామాలయంలో కొనసాగుతున్న నరసింహ జయంతి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి-** భీమ్‌గల్, ఏప్రిల్ 5: ఇంటర్ పాసైన విద్యార్థులు భీమ్‌గల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరాలని, అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనదని ప్రిన్సిపాల్ హెచ్.సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 200తో ప్రవేశం పొందవచ్చన్నారు. విద్యార్థులకు అన్ని రకాల స్కాలర్‌షిప్‌ల సౌకర్యం ఉపయోగించుకోవచ్చన్నారు. మొదటి విడుత అడ్మిషన్ ప్రక్రియ మే 21వరకు సాగుతుందన్నారు.
- **పాఠశాలలకు వంటపాత్రల అందజేత-** మోర్తాడ్, మే 5: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద సోమవారం మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన వంటపాత్రలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందికి ఎంఈవో ఆంధ్రయ్య అందజేశారు.
- **డిజిటల్ లైబ్రరీ ప్రారంభం-** ఆర్మూర్‌టౌన్, మే5: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న గ్రంథాలయంలో డిజిటల్ గ్రంథాలయ సేవలను సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్ పాల్గొన్నారు.
- **నిధుల మంజూరు చేయించాలని వినతి-** శక్కర్‌నగర్, మే5: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని 3వ వార్డులో వాల్మీకి కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కాలనీకి చెందిన యువ నాయకుడు పెరిక వెంకటేశ్ నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు వినతి పత్రం అందజేశారు. తమ కాలనీలో పలు సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు.
- **మైనర్ల తండ్రులపై కేసు నమోదు –** శక్కర్‌నగర్, మే 5: వాహనాలు నడుపుతున్న ఐదుగురు మైనర్లను గుర్తించి వారి నుంచి వాహనాలు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బోధన్ పట్టణంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో సోమవారం ఐదుగురు మైనర్లను గుర్తించామని తెలిపారు. వారి తండ్రులను పిలిపించి కేసు నమోదు చేసి కోర్టుకు పంపామని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

LOST
I, D.SANTOSH, S/o. Hari Singh, R/o. Sangam (V), Narsullabad (M), Kamareddy (D), have Lost My Passport bearing No. T9931378, while travelling from Sangam to Narsullabad on Bike on 27-01-2025. Anybody found, Contact: 9951836678.
NT-HYD

PASSPORT LOST
I, Naresh Babu Parupally S/o. P.Rajaram Babu, H.No.3-4-123, Yellareddy and Vill & Mdl, Kamareddy Dist. T.S., India., Passport bearing No.H3891038 while I am travelling from my home H.No. 3-4-123 to Xerox center on 28-04-2025 and it could not be traced out.If anybody found Pls Cont.Cell: 7396724539

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## విద్యార్థులకు వేసవిశిక్షణ శిబిరం

శక్కర్‌నగర్/మోర్తాడ్, మే 5: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో ఈనెల 10వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కరాటే, యోగా, డాన్స్, మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ తదితర అంశాలపై వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బోధన్ ఎంఈవో నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పలు అంశాలపై శిక్షణ ఉంటుందని ఆయన వెల్లడించారు. ఆసక్తి ఉన్న 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాఠశాలలోని హెచ్ఎంల వద్ద పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

**మోర్తాడ్‌లో..**

మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఈనెల 10 నుంచి 24 వరకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం సమ్మర్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంఈవో సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10 వతరగతి విద్యార్థులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మ్యూజిక్, డాన్స్, డ్రాయింగ్, యోగా లేదా కరాటే నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేయనున్నట్లు తెలిపారు. సమ్మర్‌క్యాంపునకు రావాలనుకునే వారు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మోర్తాడ్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

## కుంటలో మునిగి వ్యక్తి మృతి

బోధన్ రూరల్, మే 5: బోధన్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పోతుగంటి నాగరాజు (45) మద్యం మత్తులో రాంపూర్ శివారులోని కుంటలో మునిగి మృతి చెందాడు. బోధన్ రూరల్ ఎస్సై మచ్ఛేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన వాగ్‌మర్ లక్ష్మణ్‌తో కలిసి నాగరాజు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య లలితతో పాటు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## 11 నల్లమట్టి టిప్పర్ల పట్టివేత

నందిపేట్, మే 5: మండలంలోని చౌడమ్మ కొండూర్ మీదుగా నల్లమట్టి తరలిస్తున్న టిప్పర్లను అధికారులు సోమవారం పట్టుకున్నారు. గోదావరి నుంచి నల్లమట్టిని టిప్పర్ల ద్వారా ఆర్మూర్ ప్రాంతానికి రోజూ తరలిస్తున్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 11 టిప్పర్లను ఎంవీఐ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిబంధనలు పాటించకుండా నడుపుతున్న టిప్పర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

మోర్తాడ్/నవీపేట, మే 5: పీఎం కిసాన్ లబ్ధిదారులకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం తప్పనిసరి అని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ అన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రైతువేదికలో ఫార్మర్‌రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. భూమి ఉన్న ప్రతి రైతు రైతువేదికలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. నవీపేట మండలంలోని రాంపూర్, నారాయణపూర్, అంకన్‌పల్లి, కాండేపల్లి, జన్నేపల్లి తదితర గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్డులను కేంద్రం అమలు చేసే వ్యవసామాభివృద్ధి పథకాల కోసం వినియోగించుకోవాలన్నారు.

## రైతులకు టార్పాలిన్ల పంపిణీ

ముప్కాల్, మే 5: నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సన్నకారు రైతులకు టార్పాలిన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, సంజీవ్ థామస్, గద్దల గంగారాం, కట్ట మహేశ్, కల్లు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలి

శక్కర్‌నగర్, మే 5: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. సోమవారం ఆయన బోధన్ పట్టణంలోని బస్టాండ్ నుంచి ఆర్టీసీ డిపోనకు వెళ్లే రహదారి పక్క పలు రకాల మొక్కలు నాటారు. పర్యావరణ కాలుష్యం నుంచి రక్షణ పొందేందుకు చెట్లు ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.